సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
9705347494
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

మండల పరిషత్ సమావేశం నేడు

ఆనందపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీవో అడపా లవరాజు ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో గల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు. సమావేశానికి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరు కానున్నారని తెలిపారు.

ఏబీవీపీ జిల్లా కార్యదర్శిగా సాయికుమార్



భీమునిపట్నం: అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జిల్లా సంఘటన కార్యదర్శిగా సురవరపు సాయికుమార్ నియమితులైనట్టు రాష్ట్ర కో కన్వీనర్ లొడగల అచ్చిబాబు సోమవారం తెలిపారు. రెండు రోజుల క్రితం రాజమండ్రిలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు ఆయన్ను నియమించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని తెలిపారు.

పాఠశాలలకు పుస్తకాల చేరవేత



పాఠశాలలకు చేర్చేందుకు ఎండీయూ వ్యాన్‌లో పుస్తకాలు లోడ్ చేస్తున్న సిబ్బంది

పద్మనాభం: మండలంలోని పాఠశాలలకు ఎండీయూ వ్యానుల ద్వారా మండల విద్యా శాఖ కార్యాలయం నుంచి సెమిస్టర్ – 2 పాఠ్య పుస్తకాలను సోమవారం చేరవేశారు. మండలంలో ఐదు స్కూల్ కాంప్లెక్సుల పరిధిలో 48 ప్రాథమిక, రెండు ప్రాథమికోన్నత, తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బా విద్యాలయం ఉన్నాయి. వీటికి ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు 5864, ఆరు నుంచి పది వరకు 5150 పాఠ్య పుస్తకాలు వచ్చాయి. వీటిని ఎండీయూ వ్యాన్ల ద్వారా పాఠశాలలకు సీఆర్పీలు అందజేశారు.

అధిక ధరలకు రేషన్ సరకుల విక్రయం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లోని ఒకరిద్దరు ఎండీయూ ఆపరేటర్లు రేషన్ సరకుల ధరలు పాక్షికంగా పెంచి వినియోగదారులకు విక్రయిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిలో అరకిలో పంచదార రూ.17కాగా రూ.20కు, గోధుమ పిండి కిలో రూ.16కాగా రూ.20కు, అంత్యోదయ కార్డుదారులకు కిలో పంచదార రూ.14.50కు బదులు రూ.35కు విక్రయిస్తున్నట్టు తెలిసింది. దీనిపై పౌరసరఫరాల శాఖ అధికారులు విచారణ జరిపించి ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



మద్ది గ్రామంలో ఎరువుల దుకాణంలో పరిశీలిస్తున్న అధికారులు

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో కాళ్ల చిన్నప్పడు ఎరువుల షాపు, రేవిడిలో మజ్జి గౌరి ఎంటర్‌ప్రైజెస్ పురుగు మందుల దుకాణాలను మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం సోమవారం తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందుల నాణ్యతను పరిశీలించారు. ఎరువులు, పురుగు మందుల శాంపిల్స్ సేకరించి పరీక్షల కోసం ప్రయోగశాలకు పంపించారు. ఎమ్మార్పీ ధరకు అమ్మాలని డీలర్లను ఆదేశించారు.

పథకాల అమలుకు అర్హతే ప్రామాణికం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



తర్లువాడలో ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

ఆనందపురం : అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని తర్లువాడ, పాలవలస పంచాయతీల్లో సోమవారం నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా లబ్ధిపొందిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికాన్ని పారదోలడానికి, ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ముందుచూపుతో పాలన సాగిస్తున్నారని కొనియాడారు. ప్రతి కుటుంబానికి ఇల్లు అనేది ఎంతో అవసరమని, ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి లక్షలాది ఇళ్లు నిర్మించి పేదలకు అందిస్తున్నారని వివరించారు. ఇంకా అర్హత గల వారు ఎంత మంది ఉన్నా అందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వివరించారు. కోట్లాది రూపాయలు వెచ్చించి విద్య, వైద్య రంగాల్లో పెను మార్పులు తీసుకొచ్చారన్నారు. ప్రజల ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందుతున్నాయన్నారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన వంటి పథకాలు పేద కుటుంబాల విద్యార్థులకు ఎంతో బాసటగా నిలుస్తున్నాయన్నారు. ఇలా అన్ని రంగాల్లోనూ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లేదంటే రాష్ట్రం మరలా 40 ఏళ్ల వెనక్కి వెళ్లిపోతుందన్నారు. ఈ సందర్భంగా తర్లువాడలో 90, పాలవలసలో 230 ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లోకవరపు రామారావు, ఎంపీడీవో అడపా లవరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, సర్పంచ్‌లు బీఆర్‌బీ నాయుడు, నాగోతు అచ్చియ్యమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రౌతు శ్యామల, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, నాయకులు కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, పాండ్రంకి అప్పారావు, బొట్టా రామకృష్ణ, రౌతు శ్రీను, మజ్జి రమేష్ నాయుడు, నాగోతు నరిశమ్మ, మహేష్, బంక శ్రీను, విజినిగిరి అప్పలనాయుడు, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్లపై మురుగునీటి ప్రవాహానికి అడ్డుకట్ట

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: జాతీయ రహదారిని ఆనుకుని సబ్బివానిపేట, సంగివలస సర్వీస్ రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీటికి జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది అడ్డుకట్ట వేశారు. 'సర్వీస్ రోడ్లపై మురుగు ప్రవాహం' శీర్షికతో సాక్షిలో సోమవారం ప్రచురించిన వార్తకు సిబ్బంది స్పందించారు. డ్రైనేజీలపై విరిగిన సిమెంట్ పలకల కింద పూడికను తొలగించారు. మురుగునీరు డ్రైనేజీల్లో సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నట్టు సూపర్‌వైజర్ రవిరామ్ తెలిపారు.



సర్వీస్ రోడ్డును ఆనుకుని డ్రైనేజీలో పూడిక తొలగిస్తున్న సిబ్బంది

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం



కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న సభ్యులు

భీమునిపట్నం: లయన్స్ క్లబ్ ఆఫ్ భీమిలి గ్రేటర్ నూతన కార్యవర్గం ఎంపిక సోమవారం ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా గొరపల్లి సన్యాసిరావు అధ్యక్షునిగా, చెల్లూరి గౌరినాయుడు కార్యదర్శిగా, వాసుపల్లి ఎల్లాజీరావు కోశాధికారిగా ఎంపికయ్యారు. లయన్స్ జిల్లా గవర్నర్లు ఫర్వేజ్ హస్మీ, పీటీ కుమార్, రీజినల్ చైర్‌పర్సన్ పి.సత్యనారాయణ, సీహెచ్.చందన ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం అధ్యక్షులు సన్యాసిరావు మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లోనూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మైలిపల్లి షణ్ముఖరావు, డాక్టర్ సీహెచ్.పద్మావతినాయుడు, కూరాకుల మురళి, దుర్గా రామకోటి, చిన్నయ్యపాత్రుడు పాల్గొన్నారు.

వసతులున్న చోటకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ శోభారాణి



కళాశాల రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న ఆర్జేడీ శోభారాణి

తగరపువలస: చిట్టివలసలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి వసతులున్న చోటకు తరలిస్తామని ఉన్నత విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శోభారాణి తెలిపారు. చిట్టివలసలోని మహిళా డిగ్రీ కళాశాలను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కొత్తగా నిర్మించిన కళాశాల వసతిగృహంలో తాత్కాలికంగా డిగ్రీ కళాశాల తరగతులు నిర్వహిస్తున్నట్టు గుర్తించి విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సరైన తరగతి గదులు, విద్యుత్ సదుపాయం, ఫ్యాన్లు, బీఎస్సీ, బీకాం విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్‌లు లేవని వారు తెలియచేశారు. దీంతో ఆమె మాట్లాడుతూ భీమిలిలో మహిళా డిగ్రీ కళాశాల నిర్మాణానికి స్థల సమస్య ఉందన్నారు. అందువల్ల వసతులు ఉన్న ప్రభుత్వ భవనాలు భీమిలి, మధురవాడలో ఎక్కడ ఉన్నా అక్కడకు కళాశాల తరలించడానికి ఉన్నత విద్యాశాఖ కమిషనర్‌కు తెలియజేస్తామన్నారు. వసతులు లేకపోయినా, డిప్యుటేషన్‌పై తరగతులు నిర్వహిస్తున్నా గతేడాది నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులను అభినందించారు. అనంతరం విద్యార్థినులు, సిబ్బంది రిజిస్టర్లు తనిఖీ చేశారు.

డిప్యుటేషన్‌పై తప్పకుండా రావాలి

వివిధ కళాశాలల నుంచి డిప్యుటేషన్ విధించిన అధ్యాపకులు విధిగా చిట్టివలస ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు వచ్చి బోధించాలని శోభారాణి పేర్కొన్నారు. డిప్యుటేషన్ ఆర్డర్లు లేని అధ్యాపకులు కళాశాలకు రావాల్సిన అవసరం లేదన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు సీతంనాయుడు, కృష్ణ, జూనియర్ అసిస్టెంట్ రాజేశ్వరి, రికార్డ్ అసిస్టెంట్ అప్పారావు తదితరుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్

భీమునిపట్నం: విద్యార్థులంతా క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని కళాశాల విద్య జోన్ – 1 ఆర్‌జేడీ డాక్టర్ ఎస్.శోభారాణి అన్నారు. సోమవారం ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆమె సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రస్తుతం ఉద్యోగాలకు చాలా పోటీ నెలకొందని, అందుకు అనుగుణంగా చదువుకోవాలని సూచించారు. అనంతరం ఇక్కడి సదుపాయాలు, బోధన తీరును పరిశీలించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీబాసర విద్యార్థులకు ర్యాంకులు

తగరపువలస: ఈ నెల 15న విడుదలైన ఏపీ పీజీ సెట్ ఫలితాల్లో స్థానిక శ్రీబాసర డిగ్రీ కళాశాల విద్యార్థులకు ర్యాంకులు లభించాయి. గణితంలో ఆర్.డాంబిక 82వ ర్యాంకు, కెమిస్ట్రీలో యు.సురేష్ 120, ఫిజిక్స్‌లో కె.వేణు 628, కంప్యూటర్స్‌లో కె.రుక్మిణి 720వ ర్యాంకు సాధించారు. వేర్వేరు సబ్జెక్టుల్లో 13 మందికి వెయ్యిలోపు ర్యాంకులు లభించాయని చైర్మన్ పూడి రమేష్, ప్రిన్సిపాల్ సీహెచ్ సురేష్ తెలపారు.

ఆనంద గజపతిరాజుకు ఘన నివాళి



ఆనంద గజపతిరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

తగరపువలస: మాజీ మంత్రి పూసపాటి ఆనంద గజపతిరాజు 73వ జయంతి సందర్భంగా సోమవారం భీమిలి ఆదర్శప్రేమీ మండలి విద్యార్థులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు మాట్లాడుతూ ఆనంద గజపతిరాజు 1983 నుంచి 1985 వరకు ఆరోగ్యశాఖ, విద్యాశాఖ మంత్రిగా పనిచేసి భీమిలి అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆయన జయంతి సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో వివరాలు తప్పనిసరి

ఆనందపురం : క్షేత్ర స్థాయి సందర్శనకు వెళ్లే సిబ్బంది తప్పకుండా మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యాధికారి పి.జగదీశ్వరరావు చెప్పారు. కుటుంబ డాక్టర్ విధానంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమయ్యారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఎన్‌సీడీ సర్వే సక్రమంగా చేయాలని, గర్భిణులను గుర్తించి టీటీ అందజేయాలని, హైరిస్క్ గర్భిణులకు వైద్యుల సలహా మేరకు ఐరన్ ఫోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునేటట్టు ప్రోత్సహించాలన్నారు. గర్భిణుల వివరాలతో కూడిన మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

అనంతరం ఫార్మసీ స్టాక్ రిజిస్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. నేషనల్ ఫీవర్ హెల్త్ సర్వే, వైద్య యాప్స్ అప్లోడ్‌పై వైద్యాధికారులకు, ఆరోగ్య కార్యకర్తలకు సూచనలు చేశారు.

విద్యార్థి అదృశ్యం



అనిల్ కుమార్ (ఫైల్)

పీఎం పాలెం: విద్యార్థి అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పీఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీలో నివసిస్తున్న వేచలపు అక్షిత కుమారుడు (15) అనిల్‌కుమార్ చంద్రంపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 16న ఉదయం 10 గంటలకు ట్యూషన్‌కు వెళ్లి మరలా ఇంటికి రాలేదు. అన్నిచోట్లా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో అక్షిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రామకృష్ణ తెలిపారు.

'స్పందన' వినతుల పరిష్కారానికి చర్యలు



వినతిపత్రం స్వీకరిస్తున్న భీమిలి జెడ్సీ రాము

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద సోమవారం జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్పందన'కు ఆరు వినతులు వచ్చాయి. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి అయిదు, పట్టణ ప్రణాళిక విభాగానికి ఒక వినతి వచ్చింది. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు.

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు టైలర్స్ కాలనీలో తమ ఇంటి ముందు అక్రమంగా ఓ వ్యక్తి ఏర్పాటు చేసిన బడ్డీని టౌన్ ప్లానింగ్ అధికారులు తీసివేసినా... మళ్లీ రాత్రికి రాత్రి బడ్డీ ఏర్పాటు చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహమ్మద్ యూసఫ్ వాపోయారు. ఈ సందర్భంగా మధురవాడ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో సూపరింటెండెంట్ అప్పలరాజుకు సోమవారం వినతిపత్రం అందించారు. జోన్ పరిధిలోని వివిధ వార్డుల నుంచి పలు సమస్యలపై 6 అర్జీలు వచ్చాయి. వీటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని సూపరింటెండెంట్ అప్పలరాజు హామీ ఇచ్చారు.

చీడపీడల పట్ల అప్రమత్తత అవసరం



పాండ్రంగిలో పొలంబడి నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయం అధికారులు

పద్మనాభం: చీడపీడల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్‌రావు సూచించారు. మండలంలోని పాండ్రంగిలో సోమవారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పొలంలో తెగుళ్లను గుర్తించడం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. పురుగులు, తెగుళ్లను గుర్తించడం వల్ల పంటలు నష్టపోకుండా ఉంటారన్నారు. ఈ సందర్భంగా రైతులకు చీడపీడలు, తెగుళ్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

నూతన విద్యార్థుల సందడి

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, సైన్స్, లా, మేనేజ్‌మెంట్, నర్సింగ్ కోర్సుల్లో 2023 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు పొందిన విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్ల పరిశీలన, వసతి గృహాల్లో ప్రవేశాలు, అవగాహన తరగతులు ప్రారంభించారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన గీతం ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ర్యాంకుల ఆధారంగా వివిధ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులతో విశ్వవిద్యాలయంలో సందడి నెలకొంది. హెల్ప్ డెస్క్, బస్ పాస్ సౌకర్యం, సమాచార కేంద్రాలు ఏర్పాటు చేశారు.

చినుకు పడితే బురదమయంగా రహదారులు



హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే రోడ్డు దుస్థితి



బురదమయమైన సిద్ధార్థనగర్ రోడ్డు

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డు పరిధి పీఎం పాలెంలో వివిధ కాలనీలకు వెళ్లే రహదారులు చినుకు పడితే చాలు బురదమయంగా మారుతున్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొన్ని కాలనీలకు వెళ్లే రహదారులు మరీ అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా రేవళ్లపాలెం వెళ్లే రహదారి నుంచి పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌కు వెళ్లే మార్గం పూర్తిగా బురదమయంగా మారింది. స్టేషన్‌కు కాలినడకన వచ్చే వారు, ద్విచక్ర వాహనాలపై వచ్చేవారు ఈ దారిలో ప్రయాణించడానికి ఇబ్బంది పడుతున్నారు. అలాగే కారుషెడ్ కూడలి నుంచి హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే రహదారి కూడా చిన్నపాటి వర్షం కురిసినా బురదమయం అవుతోంది. ప్రయాణించడానికి ఈ రోడ్డు ఏమాత్రం అనుకూలంగా లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పీఎం పాలెం సిద్ధార్థనగర్‌కు వెళ్లే రోడ్డు మరీ అధ్వానంగా ఉంది. బురదమయమైన ఈ మార్గంలో రాత్రి వేళల్లో ప్రయాణించేటప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోయారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు తక్షణమే స్పందించి రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లే మార్గం మెరుగుపరచాలని కోరుతున్నారు.

పోలమాంబ ఆలయంలో శ్రావణ మాస పూజలు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని శ్రీపోలమాంబ అమ్మవారి దేవస్థానంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు ఆలయంలో ఈ పూజలు చేయనున్నారు. వచ్చేనెల 18, 25, సెప్టెంబర్ 1, 8, 15 తేదీల్లో కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. ఆగస్టు 31న గురువారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని లక్ష కుంకుమార్చన చేయనున్నారు. అమ్మవారికి నెల పూజకు రూ.350 చెల్లించి భక్తులు తమ గోత్ర నామాలతో నెల రోజుల పాటు పూజలు జరిపించుకునే అవకాశం కల్పిస్తున్నారు.

'జగనన్న సురక్ష' నేడు

పద్మనాభం: మండలంలోని రెండు గ్రామాల్లో మంగళవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ తెలిపారు. మద్ది, బాందేవుపురం గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాలకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

పేదల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఏ సమస్యలున్నా నాయకుల ఇళ్ల చుట్టూ తిరిగి విసిగిపోయేవారని... ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సమస్యలున్న చోటకే నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు వచ్చి పరిష్కరిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. తమది ప్రజా ప్రభుత్వమని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం జీవీఎంసీ 5వ వార్డు 71వ నంబరు సచివాలయం పరిధి శివశక్తినగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు నివాసాల వద్దకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరిగిన మేలును వివరించి సంక్షేమ పథకాల కరపత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొంత మంది ప్రభుత్వంపై, వలంటీర్లపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వాటిని నమ్మి మోసపోవద్దని కోరారు. నిత్యం పేదల సంక్షేమం కోసమే సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆలోచిస్తున్నారని, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటేనే సంక్షేమ పథకాలు, వలంటీర్, సచివాలయ వ్యవస్థలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా అందరికీ మేలు జరిగిందని, మరోసారి తమను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా కాలనీలో ఉన్న ఎలిమెంటరీ స్కూల్‌లో 300 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, 2 గదులే ఉండడంతో కొత్త వారిని పాఠశాలలో చేర్చుకోలేకపోతున్నారని, అదనపు తరగతి గదుల నిర్మాణానికి స్థలం కేటాయించాలని పాఠశాల కమిటీ చైర్మన్ బగాది జగదీశ్వరరావు కోరారు. శ్మశాన వాటిక అభివృద్ధి, అంగన్‌వాడీ, సామాజిక భవనం, కల్యాణ మండపం, సచివాలయ భవనం నిర్మాణం చేపట్టాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. అలాగే సచివాలయంలో సిబ్బంది కొరతను ఆయన దృష్టికి తీసుకురాగా తక్షణమే చర్యలు చేపట్టాలని జెడ్సీ కనక మహాలక్ష్మిని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, నాయకులు బి.లక్ష్మణ, వెంకటరమణ, శ్రీనివాసరావు, శ్రీదేవి, కృష్ణ, అప్పలనాయుడు, పెంట్ర అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

డీలర్‌గా కొనసాగించాలని వినతి

తగరపువలస: స్థానిక 15వ నంబర్ రేషన్ డిపోను తన పేరుతో కొనసాగించి రెన్యువల్ చేయాలని కోరుతూ డీలర్ ఉప్పల చిన వెంకటరమణ సోమవారం భీమిలి ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. తన కుమారుడు రమేష్‌బాబుతో వివాదం కారణంగా ఇప్పటి వరకు రెండుసార్లు 6ఏ నోటీసులు జారీ చేసి డిపోను వేరే వారికి అప్పగించారన్నారు. తాను హైకోర్టును ఆశ్రయించగా డిపోను తన పేరుతో కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. తనను కుమారులు పట్టించుకోనందున తనకు జీవనాధారమైన డిపోను రెన్యువల్ చేసి డీలర్‌గా కొనసాగించాలని కోరినట్టు చిన వెంకటరమణ తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో కొత్తమ్మ తల్లి



అలంకరణలో కొత్తమ్మతల్లి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ సంతపేట, కొత్తపేట గ్రామదేవత కొత్తమ్మతల్లిని సోమవారం సాయంత్రం బొగడ బంతి, లిల్లీ, బంతి, గులాబీ పువ్వులతో అలంకరించారు. యడ్లపల్లి రాంబాబు, దుంప సుజాత, వనవాడ సురేష్, బండారు సతీష్ ఆర్థిక సహకారంతో భీమిలి మండలం చిప్పాడ భవానీ పీఠం, సుత్తమ్మ తల్లి ఆలయ ప్రతినిధులు సాడి కుమార్, వెంపాడ రామిరెడ్డి ఈ అలంకరణ చేశారు. మంగళవారం ఈ ప్రత్యేక అలంకరణతో అమ్మవారి దర్శనం భక్తులకు కల్పించనున్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
9666125299, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమిలి
9912220753
Office mail : sakshiadvtvsp@gmail.com